ముళ్లపొదల్లో సొసైటీ భవనం

- మరుగుదొడ్లకు నిలయంగా గదులు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


శిథిలావస్థలో ఉన్న పీఏసీఎస్ భవనం

చిల్పూరు : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు నిల్వ చేసుకోవడమే కాకుండా, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా స్టేషన్‌ఘన్‌పూర్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో పీఏసీఎస్ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 15 ఏళ్ల పాటు అక్కడ రైతుల సమావేశాలు, ధాన్యం నిల్వలు చేసేవారు. రానురాను సొసైటీ భవనానికి వెళ్లే దారి గుంతలమయం కావడంతో పాటు వాగు నీటితో కోతకు గురి కావడం వల్ల అక్కడికి వెళ్లడం మానుకున్నారు. కొద్ది నెలల పాటు కాపలాగా ఒకరిని పెట్టగా అతడికి జీతం ఇవ్వక పోవడంతో మానుకున్నాడు. దీంతో ఇప్పుడు పీఏసీఎస్ భవనం వృథాగా ఉండిపోయింది. భవనానికి ఉన్న తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనకాల వాగు సమీపంలో దాదాపు 30 ఏళ్ల క్రితం రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు విశాలంగా నిర్మించిన పీఏసీఎస్ గోదాం భవనం ప్రస్తుతం ముళ్ల పొదల మాటున వృథాగా ఉంది. చుట్టు పక్కల ఎవరూ లేక పోవడంతో లక్షల విలువైన భవనం గదులు మరుగుదొడ్లకు నిలయంగా మారుతున్నాయి. కాగా మండల కేంద్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ భవనాలు అరకొర వసతులు ఉండే అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నాయి. కార్యాలయాలకు అనువుగా ఉండే సొసైటీ భవనం శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని వినియోగంలోకి తెస్తే ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయానికి ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



30 ఏళ్ల క్రితం నిర్మించిన పీఏసీఎస్ భవనం నేటికి చెక్కు చెదరలేదు. ప్రస్తుతం మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు అద్దె గదుల్లో కొనసాగున్నాయి. అధికారులు స్పందించి సొసైటీ భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

- వెలిశాల శ్రీనివాస్, స్థానికుడు

నిర్లక్ష్యం ఎందుకో..



చిల్పూరు మండల కేంద్రం కావడంతో ఉప ఆరోగ్య కేంద్రానికి భవనం ఎంతో అనుకూలంగా ఉంటుంది. సొసైటీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోక ముందే అధికారులు నిర్లక్ష్యం వీడి బాగుచేయించాలి.

- సట్ల లింగయ్య, స్థానికుడు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా..



వృథాగా ఉన్న సొసైటీ భవనాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్తా.మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయిస్తే వినియోగంలోకి తీసుకు వస్తా.

- చిర్ర నాగరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్

‘గోదావరి జలాలతో చెరువులు నింపుతాం’

- భూసేకరణలో రైతుకు అదనంగా రూ.లక్ష అందజేత
- ఆరుగుంటల వద్ద ఆగిన పనులు షురూ


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లింగాలఘణపురం : నెల్లుట్ల సమీపంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వ వద్ద 16ఎల్ తూము వద్ద భూసేకరణలో ఆరు గుంటల భూమికి హరిప్రసాద్ అనే రైతుకు రూ.లక్ష అదనంగా ఇచ్చి ఆదివారం పనులు ప్రారంభించారు. పదేళ్లుగా ఆరు గుంటల భూమి వద్ద సదరు రైతు కాల్వపనులు చేయనీయకుండా అడ్డుకున్నాడు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం సరిపోవడంలేదని రైతు మొండికేయడంతో కొన్ని రోజులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో రైతును ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి రైతు అంగీకరించకపోవడంతో ఎమ్మెల్యే సొంతంగా రూ.50వేలు, మాజీ జెడ్పీటీసీ రూ.50వేలు ఇచ్చి రైతును ఒప్పించి ఆదివారం పనులు ప్రారంభించారు. వంశీధర్‌రెడ్డి రైతుకు నగదును అందజేయగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, ఇతర నాయకులు సమక్షంలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మండలంలోని ప్రతి చెరువును యాసంగిలో గోదావరి జలాలతో నింపుతామని చెప్పారని గుర్తు చేశారు. ఆరు గుంటల భూమి వద్ద కాల్వ తీస్తే లింగాలఘణపురం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, చెరువులు గోదావరి జలాలతో నిండే అవకాశం ఉందని అన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న కృషికి రైతుల పక్షాన శ్రీహరిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, జీడికల్ ఆలయ చైర్మన్ మూర్తి, బిట్ల బాబు, ప్రవీణ్, నాగరాజు, బాలరాజు, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, రమేశ్, మాజీ సర్పంచ్‌లు గణపతి, శ్రీపాల్‌రెడ్డి, విజయ భాస్కర్, డీఈ రవీందర్,ఏఈ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

పాలకుర్తి: సర్దార్ పాపన్న ఆశయాలపై అన్ని సొసైటీల బాధ్యులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 17 (మంగళవారం)న కొడకండ్ల మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఈ సదస్సుకు జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్ హాజరు కానున్నారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, సహకార సంఘాల బాధ్యులు హాజరుకావాలని కోరారు. అనంతరం పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ, నర్మెట శ్రీనివాస్, కమ్మగాని పరమేశ్వర్, గిరగాని సమ్మయ్య, బండి సోమయ్య, చెరకు రాములు, పులి ప్రభాకర్, గూడ దామోదర్, పాడిశెట్టి వెంకన్న, యాకయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కొడకండ్ల : గౌడ జన హక్కుల పోరాట సమితి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రంలోని పాపన్న చౌరస్తాలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మెట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండెంపల్లి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎరుకల సైదులు, ఉపాధ్యక్షులుగా ఎల్లగౌడ్, బాల్నె మహేందర్, కోశాధికారిగా నిమ్మల మహేష్, అధికార ప్రతినిధిగా యాకన్న, సహాయ కార్యదర్శిగా ముత్యం మధు, మండల యువజన అధ్యక్షుడిగా కోల నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 17న కొడకండ్ల గౌడ సొసైటీ హాల్‌లో జిల్లా స్థాయి గౌడ జన హక్కుల పోరాట సమితి సమావేశాన్ని నిర్వహిస్తున్నందున సంఘం నాయకులు, కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం..

కొడకండ్ల యూనిట్ నాలుగో తరగతి ఉద్యోగుల యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు సత్తయ్య, వెంకటేశ్వర్లు, నర్సింగరావు, సత్తయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన యూనియన్ ఎన్నికకు కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల నాలుగో తరగతి ఉద్యోగులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా నవీన్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా తొండ సీతారామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా మమత, కోశాధికారిగా యాకయ్య, కో ఆప్షన్ సభ్యులుగా సత్తయ్య, అమరేందర్, ప్రచార కార్యదర్శిగా వినోద, కార్యాలయ కార్యదర్శిగా అఫ్జల్ ఎన్నికయ్యారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



కొడకండ్ల/జఫర్‌గఢ్ : కొడకండ్ల మండల కేంద్రంలోని మేర్గు సోమేశ్వర్ గురుస్వామి నివాసంలో, జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. 18వ నారికేళ, కలశ పూజ, పడిపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. కొడకండ్ల మండలంతో పాటు తొర్మలగిరి, వెలిశాల, తొర్రూరు, పాలకుర్తి ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారణ స్వాముల భజనలు చేసిన అనంతరం భిక్ష చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్ : గొర్రెల, మేకల పెంపకం దారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాకు గొర్రెలు, మేకల పెంపకందారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జీఎంపీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు మేకల మల్లేశం కోరారు. 19న నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, దళారులతో ప్రమేయం లేకుండా గొల్లకురుమలందరికీ రూ.2లక్షలతో నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని, 50 ఏళ్ళ వయస్సు దాటిన గొర్రెల కాపరులకు నెలకు రూ.5వేలు పెన్షన్ అందించాలని, దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రోడ్ల మరమ్మతు వెంటనే చేపట్టాలి

చిల్పూరు : ఆర్భాటంగా రోడ్లు బాగుచేస్తున్నట్లు కంకర పోసి నెలలు గడుస్తున్నా నేటికి బీటీరోడ్లకు మోక్షం రావడం లేదని రోడ్ల మరమ్మతుల విషయంలో అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో రోడ్ల పరిస్థితిపై ఆదివారం సర్వే చేయగా ఎక్కడ రోడ్లు సక్రమంగా లేవని తెలిపారు. మండలంలోని ఖచ్చీర్‌తండా, దేవోజీ తండాల్లో కంకర పోసి నెలలు గడుస్తున్నా నేటికి బీటీ వేయడం మరిచినట్లు పేర్కొన్నారు. ఇటీవల కృష్ణాజీగూడెం నుంచి చక్రితండా వరకు నాసిరకంగా బీటీ రోడ్డు వేయడం, రోడ్డు పక్కన సైడ్ బర్మ్ పోయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మించకుండానే కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 10 రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు చేయించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.

క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత



పాలకుర్తి టౌన్ : మండల కేంద్రానికి చెందిన కన్నబోయిన రమేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 2001–02 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రమేశ్ కుటుంబానికి రూ.61,300 ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కత్తుల రామచందర్ యాదవ్, దుంపల సంపత్, చిలుకమారి శ్రీధర్, చిదురాల రాజు, గుంటిపెల్లి గోవర్ధన్, పోగు గోపి, ఎండీ రహీమ్, తాహీర్, రేగుల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని మీదికొండలో జరుగుతున్న గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామి, రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. రేణుకా ఎల్లమ్మతల్లికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. శిరీష్‌రెడ్డి, శ్రీరాములు, రత్నాకర్‌రెడ్డి, యాదగిరి, గౌడ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు గ్రామస్తుల వినతి

మండలంలోని మీదికొండలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ చిలువేరు మధు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సన్మానం



బచ్చన్నపేట : నారాయణపురంలో నూతనంగా నిర్మించిన సీతారామంజనేయ ఆలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పూజలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వైదిక నిర్వాహకులు పడిగెల కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు నిర్వహించామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు నవగ్రహాల దాత బాలయ్య, ధ్వజస్తంభం దాత నర్సింహరెడ్డి, విగ్రహాల దాత నరేష్‌కుమార్‌లను శాలువాలతో సన్మానించి, మెమొంటోలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట : కారోబార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బింగ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం గ్రామాల్లో సేవలు అందిస్తూ చాలీచాలని జీతంతో కారోబార్లు నానాఅవస్థలు పడుతున్నారని అన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహా ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కారోబార్లు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అనంతపురంలో చిల్పూరువాసి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెనికి చెందిన పల్లెపు శ్రీకాంత్ (40) ఏపీలోని అనంతపురం జిల్లాలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుని తండ్రి మల్లయ్య తెలిపిన వివరాలు.. కెనాల్ పనుల్లో భాగంగా కుటుంబ సభ్యులతో అక్కడకు వెళ్లాడు. రోజు మాదిరిగానే ఆదివారం గడ్డపారతో కాల్వ తవ్వే పని చేస్తుండగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న విద్యుత్ కేబుల్‌కు గడ్డపార తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు..



బచ్చన్నపేట : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రంలోని ఆలేరు రోడ్డులోని ఎస్వీ ఫంక్షన్ హాల్ వెనకాల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిందని ఆముదాల భూపాల్‌రెడ్డి తెలిపాడు. రోజూ మాదిరిగా పొలాల్లోకి మేతకు వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కిందకు ఉన్న తీగలకు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి పలువురు కోరారు.

సంక్షిప్త సమాచారం

ఇసుకలారీ బోల్తా

రఘునాథపల్లి : హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిపై భూపాలపల్లి నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడిన సంఘటన మండలంలోని నిడిగొండ వద్ద ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. దీంతో రహదారిపై ఇసుక పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని డోజర్‌తో ఇసుకను పక్కకు నెట్టించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌ను ఢీకొట్టి లారీ బోల్తాపడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పరామర్శ

దేవరుప్పుల : శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడియం వెంకటయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన పార్థివ దేహానికి బీఆర్‌ఎస్ మండల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి నర్సయ్య మృతి చెందాడు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు రూ. 3వేలు, మాజీ సర్పంచ్ కొప్పురపు శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి రూ.2వేలు, శివరాత్రి కవితరాజనర్సు రూ.2వేల చొప్పున అందించారు. నల్ల సత్తిరెడ్డి, బాల ఎల్లయ్య, రాజేంద్రప్రసాద్, నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి, రవి, శ్రీరాములు, దశరథ, రామచంద్రు, నర్సింహులు, యాదగిరి పాల్గొన్నారు. అలాగే కొన్నె గ్రామానికి చెందిన పిట్టల చంద్రయ్య మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేలను, పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన గిద్దెల పోచమ్మ మృతిచెందగా కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ. 5వేలను అందించారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన ధరావత్‌తండా పరిధి చింతబాయితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రహదారి వెంట పలు చోట్ల రైతులు ఆరబోసిన వరి కల్లాలను పరిశీలించి సదరు రైతులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనదారుల కోసం నిర్మించిన రోడ్లపై వడ్లు ఆరబోయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తప్పించుకునే వెసులుబాటు లేని కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాహనదారులు తగు భద్రతగా వెళ్లాల్సిన రోడ్లపై రైతులు తమ అవసరాలకు కల్లాకు వాడుకుంటే నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయన్నారు. ఇకపై రహదారిపై ఎవరూ ధాన్యం ఆరబోసిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై ఊర సృజన్‌కుమార్, పోలీసులుఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ హక్కు

- మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు


సమావేశంలో మాట్లాడుతున్న రాములు

జనగామ రూరల్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ హక్కు అని మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైఎస్ఎస్ఆర్ భవన్‌లో మాదిగ ఐక్య సంక్షేమ సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం గాదె సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఏకైక అతిపెద్ద కులంగా ఉన్న మాదిగ జాతిని పార్టీలకు సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదికి తీసుకురావాలని ఉద్దేశంతో సంఘం పనిచేస్తోందన్నారు. ఎస్సీలను ఏ,బీ,సీ,డీగా వర్గీకరణ చేసేంతవరకు మాదిగ, మాదిగ ఉపకులాలను కలుపుకొని నిరంతరం ఐకమత్యంతో పోరాటం చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు చిలకర శ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పవిత్రం, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి’


భిక్షపతిని సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

పాలకుర్తి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలని డాక్టర్ కల్నల్ భిక్షపతి అన్నారు. ఆదివారం పాలకుర్తిలో ముదిరాజ్‌ల మహాసభ దాసరి మధు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ సైనికుడు డాక్టర్ కల్నల్ భిక్షపతి పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. అనంతరం భిక్షపతిని సన్మానించారు. కార్యక్రమంలో పాలకుర్తి మాజీ సర్పంచ్ తరాల చంద్రబాబు, మామిండ్ల లక్ష్మణ్, నాయకులు మామిండ్ల సోమయ్య, దాసరి యాకయ్య, మామిండ్ల యాకయ్య(టైలర్),జీడి నిరంజన్, కత్తి దస్తగిరి, జీడి శోభన్‌బాబు, ఎల్లబోయిన సోమల్లు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

- గ్రూపు రాజకీయాలు సహించేది లేదు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, గ్రూపు రాజకీయలకు పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరు, నర్సింగాపురం తండా గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, గూడూరు గ్రామ అధ్యక్షుడు బెల్లి దేవేందర్‌యాదవ్, ఆదినారాయణ, పుల్లయ్య, భుక్యా శ్రీనివాస్, చిక్కుడు రాములు, కోడురు మురళీధర్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

దేవరుప్పుల : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడిన కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు చింత శ్రీకాంత్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అలాగే కామారెడ్డిగూడెంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మరిపెల్లి యాకయ్య, పెద్దతండాలో గుండెపోటుతో మృతిచెందిన గుగులోత్ నరేందర్ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక దగ్గర కలిసి చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడి ఎన్నో ఏళ్ల తర్వాత పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరిస్తూ తమ చిన్ననాటి జ్ఞాపకాలనునెమరు వేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం అప్పటి గురువులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించా రు. కార్యక్రమంలో గురువులు ఇంద్రారెడ్డి, వెంకటాచారి, మధుసూద న్, జెన్నయ్య, పద్మలత, నజీమా, షర్మిల, యా కూబ్ పాష, శ్రీలతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఆరుట్ల దశమంత్‌రెడ్డి

జనగామ రూరల్ : భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జనగామలో పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్ అధ్యక్షతన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్, రాష్ట్ర నా యకులు కొంతం శ్రీనివాస్, ఉడుగుల రమేష్, మ హిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, బింగి రమేశ్, కార్తీక్, కోట వినోద్, చందు, ఆకుల క్రాంతి, పులిగిల్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

‘అవమానించడం సరికాదు’

దేవరుప్పుల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వారసులను ప్రభుత్వంతోపాటు కురుమ సంఘం నాయకులు అవమానించడం సరికాదని దొడ్డి భిక్షపతి, చంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని కడవెండిలో వారు విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో దొడ్డి కొమురయ్య స్మారకార్థం నిర్మించే కురుమ భవన నిర్మాణ పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం సందర్భంగా తమ కుటుంబ సభ్యులకు కనీస ఆహ్వానం లేకపోవడం కించపర్చే చర్యగా అభివర్ణించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొమురయ్య వారసులకు కనీస గౌరవం లభించని తరుణంలో కాంగ్రెస్ పాలనలో సముచిత గౌరవం లభిస్తుందని ఆకాంక్షిమన్నారు. సాయుధ పోరాటంలో ఒక్క కుటుంబం నుంచే ముగ్గురిని కోల్పోయాం. ఇంకా ఏం కోలుపోవాలని ప్రశ్నించారు. కురుమ రాష్ట్ర సంఘానికి కొమురయ్య పేరుచెప్పడమే తప్ప ఆయన మూలాలు కలిగిన ఉద్యమ కెరటమైన కడవెండి గ్రామాన్ని విస్మరించడం శోచనీయమన్నారు.